# తోటకూరా - తులసాకూ

"చింత చిగురుచ్చింతా చిగురు చ్చించిగురేయ్-"

కోటిగాడి పిలుపు నేతాజీనగర్ కోలనీలో మారుమోగింది. ఉదయం ఎనిమిది దాటుతుంది. ఏప్రిల్ నెల చివరివారం. ఎండ కొంచెం కొంచెం పదునెక్కడం ప్రారంభించింది.

"ఈ సంవత్సరం ఎండలు కళ్లు పేలిపోయేలా వున్నాయి. ఇప్పుడే కన్నెత్తలేకుండా వున్నా-" అని ఉసూరుమని చమట తుడుచుకుంది తులిసమ్మ. దిక్కుమాలి గ్రైండరు పాడయిపోయింది. ఏనిమనిషిచేత కొబ్బరిపచ్చడి రుబ్బిస్తున్నది. పనిమనిషి రెక్కలు ముక్కలుచేసుకుని రుబ్బుతుంటే - పక్కనే స్టూలు మీద కూచుని చూస్తున్న తులసమ్మకు చెమట్లు పోసేశాయి. వంటగదిలోకి వెళ్లింది. చింతచిగురు పిలుపు చెవులదిరేలా వినిపించింది.

"ఇదిగో రాజా - ఆ చింతచిగుర్నిలా పిలూ-" అన్నది. ఇడ్లీలు పళ్లెంలోకి తీస్తూ.

"ఇదిగో ఓయ్ చింతచిగురూ - ఇట్రా ఇట్రా - అన్నది రాజు, రోలు దగ్గిరినుంచి లేవకుండానే

తులసమ్మ భర్తపేరు కె.వి.ఎన్. కోటేశ్వరరావు ఎం.కాం. కోటిగాడి పేరు కూడా కోటేశ్వరరావే. వాడు చింతచిగురు, కరివేపాకు, వేపపుల్లలు, ఉప్పు, తోటకూర, గోంగూర, తేగలు, ముంజెలు, తాటాకు విసన కర్రలు, రేకలు, అరటాకులూ మొదలయిన నానా రకాలైన వస్తువులు అమ్ముతుంటాడు. సమయాన్ని బట్టి ఈత పళ్లు , నేరేడు పళ్లు కూడా అమ్ముతాడు. వాడు నేతాజీ నగర్ దాటేక ఆదివారపు పేటలో చర్చి పక్క వీథిలో రోడ్డు చివర పాకలో వుంటుంటాడు.

కె.వి.ఎన్. కోటేశ్వరరావు ఎం.కాం. రిటైర్డు సబ్ ట్రెజరీ ఆఫీసర్. వాళ్ళది కావడానికి ఎం.ఐ.జి. బిల్డింగే కాని హెచ్.ఐ.జి. బిల్డింగు కంటే పెద్దది.

కోటిగాడు గంపదించాడు. ఒక రూపాయి కూర పెట్టమంది తులసమ్మ.

"ఇదిగో నువ్విటొచ్చి - చేటిలా పట్రా " అని రాజు గుంటని కేకేసింది, ఆవిర్లు కక్కుతున్న ఇడ్లీల మీద పువ్వులపళ్లెం మూతపెట్టి ఇవతలికి వస్తూ.

"ఏంటయ్యా బొత్తిగానూ - నాలుగాకు లెయ్యి. రూపాయి కూరా యిదీ"

"చిగురెక్కడా లేదమ్మా - చీకట్నేపోయినోణ్ణి ఇదిగో ఇప్పుడొచ్చినాను - బాగా చిటారుకొమ్మకి పోయింది చిగురు - కొసరకండమ్మా -" అన్నాడు కాస్త చిగురువేస్తూ.

"అణా ఇస్తే - బాగా యింతకూర పెట్టేవారు. పప్పువేసి వండితే ఇంటిల్లపాదికీ రెండుపూటలకీ సరిపోయేది - రూపాయికి పట్టుకుని పిడికెడు కూరయినా రాలేదు. బొత్తిగాగాయకం అయిపోయింది -"

తులసమ్మకి సుమారు యాభై యైదేళ్లుంటాయి. కోటీశ్వరావుకి వచ్చే నెలలో షష్టిపూర్తి. మిత్రులంతా కలిసి గొప్ప సన్మానం చేస్తామంటున్నారు.

"రూపాయికేటొస్తుందమ్మా - తమురుకు మాత్రం తెలవందేముంది -?"

మళ్లీ మరోసారి కొసిరి మరొకనాలుగాకులు వేయించుకుని - చింకిరూపాయిచ్చింది.

"ఈ రోజుయినా గ్రైండరు బాగుచేయించుకొచ్చేది వుందా లేదా ?" అనరిచింది తులిసమ్మ. ఆవిడ నోరే అంతా ప్రెసిడెంటాఫ్ ఇండియా అయ్యేది తనమానే పైనుండాలి.

చిన్న కొడుకు పేరు యశ్వంతరావు. ఎం.ఏ. ఎకనమిక్స్ చేశాడు. ఫస్ట్‌క్లాసొచ్చింది. ఉద్యోగం లేదు. రాజుగారు కొత్తగా పెట్టిన వివేకానంద కాలేజీలో పార్టుటైము లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. పద్నాలుగొందలిస్తారు. "ఇవ్వాళ తండ్రీకొడుకుల్లో ఎవరో ఒకరు గ్రైండరు బాగుచేయించి తీరాలిసుమా - లేకపోతే లాభం లేదు" - అని గట్టిగా హెచ్చరించింది, తులసమ్మ.

పక్కవీథిలో పద్మావతుంది. ఆవిడ పిలిస్తే కోటిగాడికి భయం. గీసి గీసి బేరం ఆడుతుంది. ఆమె పిలుపు వినిపించనట్టు మలుపు తిరగబోయేడు.

"ఇదిగో నిన్నే ఓయ్ చింతచిగురూ - " అని కీచుగొంతు సాగదీసుకుంటూ మూడోసారి పిలిచింది. రూపాయిచ్చి రూపాయిన్నర చిగురు పెట్టించుకుని, "చింతచిగురు తేలేదా ?" అనడిగింది. కొత్తరూపాయిబిళ్ల పదిసార్లు చూసుకుని ఇచ్చింది.

"కొత్తబిళ్లయినా ఈ రూపాయికి మరోపావలా ఎక్కువ్విరుకదా" అంటూ గుమ్మం దిగాడు.

పద్మావతమ్మ పప్పులు పాపాయమ్మ దగ్గిర ఉడకవు. ఆవిడ కొసరివ్వదు. ఎప్పుడు పద్మావతమ్మకీ పాపాయమ్మకీ తగువే. కోలనీ అంతా అమ్ముకుని తిన్నగా టవునులోకి పోయి మిగతా సరుకంతా పది పదకొండయ్యేసరికి అమ్మేస్తారు. గంగరాజు కిరాణా కొట్టుమీద కావలసిన సరుకులు కొనుక్కుంటారు. పాపాయమ్మ రెండోపూట మరి రాదు. కోటి ప్రతిరోజు సాయంత్రం తప్పక - వేప, తుమ్మ, బరిణక, కాగు పుల్లలు పట్టుకుని ఐదురోడ్ల జంక్షనులో కూచుంటాడు.

యశ్వంతరావుకి తండ్రికి క్షణం పడదు. విరసం, పౌరహక్కుల సంఘం , దళిత సంఘం, నాస్తికసమాజం - అంటూ ఈ మధ్య నానా సంఘాలవాళ్లతోనూ తిరుగుతున్నాడని తండ్రికి చిన్న కొడుకుమీద కోపం. వాడొకసారి సంభాషణల్లో నక్సలైట్లని బలపరుస్తూ మాట్లాడేడు. ఈ విషయం కోటేశ్వరరావుకి కొరుకుడు పడకుండా వుంది. ఈ వెధవకి ఎక్కడదొరికారో దిక్కుమాలిన ఫ్రెండ్స్ - అని తెగ చిరాకుపడతాడు.

నాలుగు రోజుల క్రితం ఒక ఆదివారం మధ్యాహ్నం సరిగ్గా రెండు గంటలవేళ కోటిగాడు తాటిముంజెలు తెచ్చాడు. రూపాయికి పదిముంజెలు కంటే ఎక్కువివ్వలేనని కరాఖండిగా చెప్పాడు. "ఒళ్లంతా ఎర్రచీమలు పొడిచీశాయి. తాటి చెట్లెక్కడం మాకష్టంగా వుంద"న్నాడు. చివరకి నాలుగు రూపాయల ముంజెలు కొన్నారు. కోటి గుమ్మం దిగాడో లేదో యశ్వంత్ మొదలుపెట్టాడు.

"ముంజెలమ్ముకొనే వాళ్లదగ్గర, కరివేపాకు తోటకూర అమ్ముకొనే వాళ్లదగ్గర తెగ బేరాలాడుతారు. ఆ శ్రీ మహాలక్ష్మి క్లాత్ సెంటరు వాడితో ఒక మాట మాట్లాడరు. దివ్యజ్యోతి ఎంటర్‌ప్రైజస్ వాడితో మాట్లాడలేరు. వందలూ వేలూ ఇచ్చీసి వస్తారు " అని ప్రారంభించాడు. ఆ ముందురోజే తులసమ్మ 15 వందలిచ్చి రెండు చీరలు కొన్నది, బ్లౌజ్ విత్ శారీ . బాగా పెద్దంచులు పైటచెంగు డిజైను చాలా బాగుంది. రెండు చీరలు చాలా నచ్చీశాయి. చీరలకి ఫాలు, లోపల లంగాలు కొనాలి. జాకెట్లు కుట్టించుకోవాలి. ఆ ఖర్చు ఎంతలేదన్నా మరొక నూటయాభయి రెండువందలు ఉంటుంది. ఆ చీరలగురించి ఎత్తాడన్నమాట .

"ఇంటి నిండా ఇవాళ ఎలాంటి సామానుంది. ఒక్కసారి చూడండి. వాటరు ఫిల్టరు, గ్రైండరు, గేస్ పొయ్యి, ప్రెషరు కుక్కరు, నాన్ స్టిక్ పాన్, హాట్ పాట్, ఫ్రిజ్, డైనింగు టేబులు , వాషింగు మిషనూ - ఇక ఇవతలికొస్తే , టు-ఇన్-వన్, కలర్ టీ.వి. నాలుగు సీలింగు ఫేనులు, నాలుగు ట్యూబు లైట్లు, ఎమర్జెన్సీ లైటు. ఉషా కుట్టుమిషను, రెండు గోద్రెజ్ బీరువాలు, సోఫా, రెండు టీపాయిలు, డ్రస్సింగు టేబుల్, నాలుగు నాన్‌బ్రేక్ ప్లాస్టిక్ కుర్చీలు, ఒక డబుల్ కాట్, ఒక ఫోల్డింగు కాట్ ఇలాగ ఇల్లంతా నానా రకాల అధునాతనమైన ఖరీదైన సామానుంది. ఇవన్నీ కాక ఒక వెస్పా, ఒక లూనా ఉన్నాయి. బీపీ ఎక్కువగా ఉంది బండి డ్రైవింగు చెయ్యొద్దని డాక్టరు చెప్పాడని. ఈ మధ్యనే వెస్పా అమ్మేశాడు, కోటేశ్వరరావు ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా రిక్షా లేక ఆటో. ఇన్నివస్తువుల్లోనూ ఎప్పుడూ ఏదో ఒకదానికి రిపెయిరు వస్తునే ఉంటుంది. ఈ మధ్యనే ఐదొందలు ఖర్చు చేసి టీ.వి. రిపెయిరు చేయించారు. తరవాత టేబుల్ ఫేను రిపెయిరు. స్విచ్ వేస్తే చాలు షార్టయి ఫ్యూజులు కొట్టేశాయి. చచ్చినట్టు యశ్వంతు నిమిషాలమీద వెళ్లి బాగు చేయించుకొచ్చాడు. దిక్కుమాలి కరెంటు ఎప్పుడుపోతుందో తెలీదు. ఉన్నా లోవోల్టేజీ , హైవోల్టేజీ సమస్య. బెడ్ రూంలో ట్యూబులైటు తిన్నగా వెలగనే వెలగదు. వేలువేలు పోసి ఈ సామానంతా కొన్నాం. దేనికీ గేరంటీ లేదు. ఏం అనడిగితే "లైఫ్‌కే గేరంటీ లేదు సార్" అని వెధవ జోకొకటి వేశాడు.టీ.వి. షాపువాడు. వాళ్లనేమీ అనలేం. కన్స్యూమర్స్ కోర్టులున్నాయిగాని ఎంతమంది కేసులు వేయగలరు ?. తెల్లవారి లేచి ఎంతమందితో తగువాడగలం ?. వెధవ ముంజెలమ్మేవాడు మాత్రం లోకువ. మనం ఎవరమైనా వందకాదు వెయ్యి రూపాయలిచ్చినా తాటిచెట్టెక్కి ముంజెలు తియ్య గలమా ? - దించిన తాటికాయల్ని చక్కగా చెలిచి నీరుపోకుండా ముంజెలు తియ్యగలమా ? అంతెందుకు ఈ ఎండలో తారురోడ్డు మీంచి నాలుగడుగులు నడిచి ఒక బిందెతో మంచినీళ్లయినా తేగలమా ? కష్టపడి అన్ని మైళ్లు ఎండలో నడిచి కాళ్ల దగ్గరికి ముంజెలు తెచ్చిపెడితే, వాడిని చులకనగా చూసి గీసి గీసి బేరం ఆడతాం ......"

తులసమ్మ యశ్వంత్ మాటలు వింటూ పెరట్లో కూర్చుంది. చల్లగా గాలి వీస్తుంది. చిన్న కొడుకు మాటలు సమంజసంగానే ఉన్నాయి. కాని అలా మాట్లాడితే ఎవరు వింటారు ?. భోజనానంతరం నిద్రపోతున్న కోటేశ్వరరావుకి చిన్న కొడుకు మాటలకి మెలుకువొచ్చింది. కోర్టులో వాదిస్తున్నట్టు ఫోర్సుగా మాట్లాడుతున్నాడు. మాంచి గాఢ నిద్రలో ఉన్నాడేమో ఆ మత్తులో ఎక్కడో ఎవరో కొట్టుకుంటున్నట్టనిపించి సడన్‌గా మెలుకువొచ్చింది. అట్నించిటు చిరాగ్గా వొత్తిగిల్లి మళ్లీ రెప్ప వేశాడు. పైన ఫేను తిరుగుతున్నా బాగా ఉక్కబెడుతున్నది. మెల్లిగా లేచి తువ్వాలుతో తుడుచుకుంటూ బయటికొచ్చాడు.

"ఇంతకీ ఏమిటంటాడూ - " అన్నాడు, అసహనంగా.

"నేను చీరలు కొనుక్కోవడానికీ - ముంజెలు బేరం ఆడడానికి సంబంధం ఏమిట్రా అన్నది తులసమ్మ ఊరుకోలేక . ఆమెకి చిన్న కొడుకంటే వల్లమాలిన ముద్దు. ఈ మధ్య ఎందుకోగాని వాడి మాటలు వింటుంటే భయంగా ఉంది. మాటతీరులో కూడ చాలా తేడావచ్చింది.

తాను ఇటీవల నేర్చుకున్న భావాలేమిటో, ఆ భావాల వెనకగల సైద్ధాంతిక ప్రాతిపదిక ఏమిటో ఒకసారి వివరంగా చెప్పే ప్రయత్నం చేశాడు. వింటున్నంత సేపు వాడిమాటలు బాగానే ఉంటున్నట్టనిపించినా చివరికి ఎందుకో భయం వేసింది. వాడు నక్సలైట్ల గురించి మాట్లాడుతుంటే ఎందుకో ఆమెకు వెన్నులోంచి

సన్నగా వణుకు బయలు దేరింది. ఏదో ఒక రోజు కొడుకు కోసం పోలీసులుగాని ఇంటిమీదకొస్తారేమో నని కొత్త భయం పట్టుకుంది. ఆమెకు ప్రాణాలు తల్లడిల్లిపోయాయి. కొడుకు తెలివైన వాడే కాని ఆ తెలివి తేటలు వాడినెక్కడికి తీసుకు వెళ్తున్నాయి ? వాడుగాని తమనించి దూరం అవుతున్నాడా ?

"సంబంధం ఎందుకులేదమ్మా పూర్తిగా వుంది. అంతా సరుకుల మాయ. దోపిడీ - ఓపిగ్గా వింటానంటే చెబుతాను. " అని ప్రారంభించి వస్తువుకీ, సరుక్కీ తేడా చెప్పాడు. "మనం ఇంట్లో ఇడ్లీలు చేసుకుంటాం. అది వస్తువు. దాన్ని హోటేల్లో అమ్మితే, లేక కొనుక్కుంటే అది సరుకు. మన యింట్లో కొబ్బరి చెట్లున్నాయి. అవి దింపించుకుంటాం. పచ్చడి చేసుకుంటాం. నువ్వు కొబ్బరికోరూ, శెనగపప్పు అద్భుతంగా కూరొండుతావు. లేదా బెల్లం వేసి కొబ్బరుండలు చేస్తావు. అవన్నీ వస్తువులు. ఆ కొబ్బరికాయల్నే లేక కొబ్బరుండల్నే అమ్మకానికి పెడితే సరుకులు -"

కరెంటు పోయింది. కోటేశ్వరరావు బనీను విప్పేసి తలుపు మీద వేసి - గుమ్మానికడ్డంగా కుర్చీ లాక్కుని కూచున్నాడు. తులసమ్మ లేచి రెండు విసనకర్రలు తెచ్చి మొగుడికొకటిచ్చి తనొకటి తీసుకుంది. యశ్వంత్‌కి కూడా ఒకటి తెచ్చిద్దాం అనుకుంది గాని - విసనకర్రా - ఫాన్ అంటూ మళ్లీ మరొక ఉపన్యాసం మొదలు పెడతాడేమోనని జడిసి ఊరుకుంది.

"చిన్న చిన్న వస్తువులమ్మేవాళ్ల కష్టం ఆలోచించం. గీసి గీసి బేరం ఆడతాం. అదే పెద్ద పెద్ద షాపుల్లోకెళ్లి వందలూ, వేలూ పోసి మారుమాట్లాడకుండా కొని తెచ్చుకుంటాం. సరుకు ఖరీదు పెరిగేకొద్దీ లాభం పెరిగి కొనుగోలు దారును దోపిడీ చెయ్యడం ఎక్కువవుతుంది".

"నువ్వు మరీ చెబుతావురా. నాన్నగారు బేరం ఆడకుండా ఏవస్తువూ కొనరు మొన్న లుంగీ పంచెలు తువ్వాళ్లు కొనుక్కొచ్చారు. మొత్తం మీద ఎంతోకొంత తగ్గింపు ఇచ్చాడు కదా ఆ మధ్య రెండు ట్యూబులైట్లు కొన్నాం. ఇరవై రూపాయలు తగ్గించాడు."

" ఆ సంగతా చెబుతున్నావు. పావలా కూడా చెయ్యని వస్తువు పది రూపాయలకి అమ్ముతారు. వందరూపాయలు పైగా ఖరీదుచేసే హార్లిక్స్ ప్రొడక్షన్ కాస్ట్ పదిరూపాయలు కూడా వుండదు. ముప్ఫయి రూపాయలు పెట్టికొనే షాంపూ సీసా ఖరీదు అయిదు రూపాయలు దాటదు. మిగతా అంతాలాభమే. ప్రతి పదినిముషాలకీ ఆ వస్తువుల గురించి టీ.వి. లో ఎడ్వర్టయిజుమెంట్లువ్వడానికే లక్షలకి లక్షలు ఖర్చు చేస్తారు. ఆ సొమ్మంతా ఎక్కడిది ? మనమీదే తీస్తారు. ఆ టూత్ పేస్టులూ, సబ్బులూ, షాంపూలూ వాటి గురించి ఒకటికి పదిసార్లు - కాదు - వందసార్లు టీ.వీ.ల్లో చూస్తుంటే నాకు పరమ అసహ్యం వేస్తుంది. ఆఖరికి వార్తలు కూడా స్తిమితంగా చూడనివ్వడు లేదు. రోజుకి ఎన్నిసార్లు పళ్లుతినాల కోవాలో భయం వేస్తోంది -"

ఎక్కడా ఆకు అల్లాడటం లేదు. ఒక్క రవ్వ కూడా గాలి ఆడటంలేదు. కోటేశ్వరరావు లేచి చాలా అసహనంగా అటుయిటూ తిరగనారంభించాడు.

"సరేలే - ఎందుకొచ్చిన వాదన - వెళ్లి పనిచూసుకో -" అన్నాడు కోటేశ్వరరావు.

యశ్వంత్‌కి చాలా కోపం వచ్చింది. తాము వాదనలో ఓడిపోతామని భయం వేసినప్పుడు పెద్ద వాళ్లాడే మాటేయిది. అమ్మ గొంతు పెద్దదే. కాని ఒకసారి తండ్రి కళ్లెర్ర జేసి -" ఇకచాల్లే - లోపలికి వెళ్లి పనిచూసుకో -" అని గసిరేసరికి, పిల్లిలా తోకముడిచి కిక్కురుమనకుండా వంటగదిలోకి వెళ్తుంది.

తండ్రి రికార్డసిస్టెంటుగా ఉద్యోగంలో చేరి - క్రమంగా ప్రమోషన్లు పొంది చివరికి సబ్‌ట్రజరీ ఆఫీసరయ్యాడు. కాని అమ్మకి - ఏ ప్రమోషనూ లేదు. ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు లేవు. రోడ్లు మరిచేవాళ్లకీ, అంట్లుతోమే పనిమనుషులకీ ఏం ప్రమోషన్లుంటాయి ? యశ్వంత్ గట్టిగా సమాధానం చెప్పాలనే అనుకున్నాడుగాని, గాలిలేక ఉక్కబెట్టడం వల్ల - అతనికీ చాలా అసహనంగానే వుంది. ఉద్యోగం కూడా ఒకవిధంగా వ్యాపారమే. ఈ ఉద్యోగులకి వేలకివేలు జీతాలు ..... జీతాలు ఎంత పెరిగినా లంచాలు తప్పవు. ఉద్యోగ ధర్మాన్ని కూడా సరుకుగా చేసి అమ్ముకుంటున్నారు.

"ఒక రూపాయి కూడా కట్నం పుచ్చుకోకుండా నాకు నచ్చిన పిల్లని చేసుకుంటాను" - అని ఒకసారి తల్లితో అన్నాడు. తండ్రి కులం, సంప్రదాయం పాటించే మనిషి.

"మీ నాన్నగారికి గాని ఈ సంగతి తెలిసిందో చంపేస్తారు. ఇంట్లోంచి తన్ని తగిలేస్తారు. ఇంకేమన్నావుందా -" అన్నది తల్లి కంగారుగా.

"మరో మూడేళ్లలో ఈ శతాబ్దమే మారిపోతున్నది. ఇరవై ఒకటో శతాబ్దంలోకి వెళిపోతున్నాం. ఇంకా ఈ కులాలూ, కట్నాలూ - ఛ - " అన్నాడు.

ఎం.ఏ. ఫస్టుక్లాసులో పాసయిన ఇరవై నాలుగేళ్ల యశ్వంత్‌కి పెళ్లి సంబంధాలొస్తున్నాయి. ఉద్యోగం రానిదే చేసుకోనని ఖచ్చితంగా చెప్పేశాడు. అతని మనసులో సునీత వుంది. ఎర్రగా పొడవుగా చలాకీగా వుంటుంది. తను పనిచేసే కాలేజీలోనే బోటనీ లెక్చరరుగా పనిచేస్తోంది. తనకి క్రికెట్టంటే ఇష్టం వుండదు. కాని ఫ్రెండ్సంతా తనని క్రికెట్ ప్లేయర్‌లా వుంటావంటారు. సునీత గురించి యశ్వంత్‌కి ఏమీ తెలియదు. ఆమె పరిస్థితులేమిటో, భావాలెటువంటివో తెలియదు. ఆమెని తప్పక పెళ్లి చేసుకోవాలన్న కోరిక మాత్రం బలంగా వుందతనికి.

యశ్వంత్ చెయ్యిదాటిపోతున్నాడని తల్లి దండ్రు లిద్దరికీ భయంగానే వుంది. ఎప్పుడూ పేర్లు వినని పత్రికలు చదువుతుంటాడు. సృజన, స్వేచ్ఛ, అరుణతార, ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, సెమినార్..... ఏనాడూ జీతం డబ్బులు యింట్లో ఇవ్వడు. తండ్రి అడగనూ లేదు. ఆ అవసరమూ పడలేదు. బుద్ధిపుడితే తనంతట తనే తల్లి చేతికి రెండొందలో మూడొందలో ఇస్తాడు. అయితే - ఏనాడూ తండ్రిని డబ్బులడగడు. యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లో కూడా డబ్బులడిగేవాడు కాదు. మెరిట్ స్కాలర్ షిప్ వచ్చింది. ఆ డబ్బుల్తోనే గడుపుకున్నాడు. అడక్కుండా అవసరాలు గుర్తించి ఇస్తే తప్ప తీసుకోడు. బయటికి వెళ్లి సినీమాలు, షికార్లూ చేసే అలవాటు మొదట్నించీ లేదు. అదుగో ఆ సురేష్ సావాసం చెయ్యడం మొదలయ్యిందగ్గర్నించీ ఇలా తయారయ్యాడు.

సురేష్ వాళ్లిల్లు ఈ కోలనీలోనే - చివరి వరస. అతని తండ్రి కూడ కోటేశ్వర్రావు కంటే పెద్ద ప్రభుత్వోద్యోగం చేసి రిటయిరయ్యాడు. చాలాకాలం క్రితమే పరిచయమయ్యింది గాని ఇటీవలే వాళ్ల పరిచయం మంచి స్నేహంగా అభివృద్ధి పొందింది.

కోటిగాడికి రెండు రోజుల్నించీ ఊష్ణం. వళ్లంతా నిప్పుల గుండంలా వుంది. కోలనీలో - ఎల్.ఐ.జీ. ఇళ్లున్న వరసలో ఒక ఎలిమెంటరీ స్కూలు మేస్టారున్నారు. ఆయన వైద్యం కూడా చేస్తుంటాడు. ఆయన కోటికి మాత్రలిచ్చాడు. ఒకంతట తగ్గలేదు. రెండురోజుల్నించీ కటిక లంకణాలు. కోటి పెళ్లాం ఆ మేస్టారింట్లో పనిచేస్తుంది. మేస్టారి భార్యకూడా టీచరే. కోటిగాడు కష్టపడాలి. పిట్టని కొట్టా పొయిలోపెట్టా.

ఏదోకటి అమ్ముకొని రావాలి. మొదట్లో కూలిపనులకు వెళ్లేవాడు. పునాదులు తవ్వుతుంటే ఒకసారి గునపాం కాలుమీద పడి నెల్లాలు బాధపడ్డాడు. ఆతరవాత ఇక కూలిపనులు మానేశాడు. చింతచిగురు, కరివేపాకు, ములుంజెలు - లేకపోతే గెడ్డవార మెత్తటి మన్ను - ఇలాగే ఏదోఒకటి నమ్మాలి. వర్షాకాలంలో చేపలు పడుతుంటాడు. అవి పట్నం వెళ్లి అమ్ముతాడు. కోలనీలో కొందరు తను చేపలమ్మడం చూస్తే మిగతా వస్తువులు కొనరు. కనుక పట్నం పట్టుకుపోతాడు. మనుషులకు కాదు సరుకులకు కూడా కులాలుంటాయి గావును. కులాల సంగతి ఏమో గాని సరుకులక్కూడా వర్గాలు మాత్రం తప్పక ఉంటాయి.

సురేష్ వాళ్ల ఇంటి చుట్టూ చాలా ఖాళీ జాగా వుంది. మొదట్లో ఇవన్నీ మెట్ట పొలాలు వేరుశనగ పండేది. ప్లాట్లు వేస్తున్నప్పుడు వెంకారెడ్డి ఈ స్థలాన్ని ఎంచుకున్నాడు. దీన్ని చేర్చి గోర్జీ, తాటితోపూ, నీళ్లబట్టీ, ఉన్నాయి. అవన్నీ తన ప్లాటులో కలిసిపోయాయి. తాటితోపు మొత్తం కొట్టేశారు. దాంతో వెంకారెడ్డి స్థలానికి మరొక ఐదు సెంట్లు చవకరేటుకి కలిసొచ్చింది. ఆ స్థలంలో విశాలంగా బిల్డింగు కట్టించి చుట్టూ రకరకాల చెట్లు పెంచారు. వేపచెట్టు కింద రెండు కుర్చీలు వేసుకుని సురేష్, యశ్వంత్ కూర్చున్నారు. వాళ్లమధ్య స్టూలుమీద వేయించిన వేరుశనగ పప్పు, బెల్లం ముక్కలూ ఉన్నాయి.

సురేష్ హైదరాబాదులో ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ చేశాడు. తరవాత ఒక పెద్ద ఇంజనీరు దగ్గర రెండేళ్లు ఎప్రెంటీస్‌గా పనిచేసి అన్ని పనులు నేర్చుకున్నాడు. ప్రస్తుతం సొంతంగానే బిల్డింగు ప్లానులు డిజైన్లు చేస్తూ బాగానే సంపాదించుకుంటున్నాడు. యశ్వంత్ కంటే రెండుమూడేళ్లు పెద్దవాడుంటాడు. సురేష్‌కు ఒక అక్క ఉంది , ఆమె భర్త భిలాయిలో పెద్ద ఇంజినీరు చెల్లెలు వైజాగ్‌లో ఎం.బి.బి.ఎస్. చేస్తున్నది. సురేష్ హైదరాబాదులో చదువుకొనే రోజుల్లో విప్లవభావాలవేపు ఆకర్షితుడయ్యాడు. సునీతనే ఎస్.సి. అమ్మాయి ఆత్మహత్య కేసులో చాలా పెద్ద ఉద్యమం జరిగింది. దోషిఅయిన ఉస్మానియా ప్రొఫెసరుని తన్ని కాలుచేయి విరిచేశారు. ఆ కేసులో సురేష్ అరెస్ట్ అయ్యాడు. ఆ కేసులో చాలా కాలం కోర్టుల చుట్టూ తిరిగాడు రెండేళ్ల తరవాత కేసు కొట్టేశారు. కాని సురేష్ కి చాలా అనుభవం వచ్చింది. విరసం సభ్యుడు సత్యం మాస్టారు సురేష్‌కి ఒక రకంగా గురువు లాంటివారు ఆయనిప్పుడు విశాఖ పట్నంలో వుంటున్నారు. ఆయన పాతికేళ్ల క్రితమే ఒక ఎస్.సి. అమ్మాయిని ప్రేమించి పెద్దల నెదిరించి పెళ్లి చేసుకున్నారు. ఆయన ప్రోద్బలం వల్లనే సురేష్ ఎ.పి.సి.ఎల్.సి. (పౌరహక్కుల సంఘం) లో సభ్యుడయ్యాడు.

సురేష్ తల్లిదండ్రులు చాలా చాదస్తం మనుషులు. తల్లి రోజా తులసి చెట్టుకి పూజ చేస్తుంది. ఉపవాసాలుంటుంది. తండ్రి వెంకారెడ్డి నిత్యం భగవత్‌గీత పారాయణ చేస్తుంటాడు. రామకోటి రాస్తుంటాడు. ఇదంతా చూస్తుంటే సురేష్‌కి దైవభక్తి వెనకగల వర్గ దృక్పధం కొంత వరకు తెలిసింది. కులాలకంటే వర్గాలు చాలా బలమైనవని బోధపడింది. డాబామీద ఒక గది ఉంది. అది సురేష్‌ది. దానిలో భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు బొమ్మలుంటాయి. ఈ మధ్య కొత్తగా మార్క్స్, ఏంగిల్స్, లెనిన్, స్టాలిన్, మావో - ఈ అయిదుగురు ఉన్న ఫోటో సంపాదించి పెట్టాడు. ఆ ఫోటో సత్యం మేస్టారే యిచ్చారు.

"ఈ యంత్రనాగరికత, పారిశ్రామికీకరణ - మనుషుల్ని రోజురోజుకీ వాళ్ల మూలాల్నించి వేరుచేస్తున్నాయి. ఈ లక్షణం ఎంతోకొంత భూస్వామ్య వ్యవస్థలో కూడా లేకపోలేదు. కాని అందులో ఒకమేరకయినా ప్రేమ, అభిమానం, కరుణ, మానవత్వం - ఈ మొదలైన గుణాలుండేవి. కనుక ఎంతటి

సామ్రాజ్యవాదులైనా, దురాక్రమణ పరులైనా ఆ నాటి పాలకుల్ని ప్రజలు మెచ్చుకున్నారు. ఒక మేరకయినా - అది మనుధర్మమే కావచ్చు - వాళ్లు ఒక ధర్మానికి కట్టుబడి పాలించారు. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో సమస్త విలువలూ ధ్వంసమైపోయాయి. ప్రేమ, కరుణ, మానవత్వం - అన్నీ సరుకులుగా మారిపోయాయి. పరాయీకరణ స్థాయి సామ్రాజ్య వాద వ్యవస్థలో రానురాను మరింతగా పెరిగిపోతుంది" అన్నాడు సురేష్.

"నాకెందుకో టీ.వీ.ల్లో ఎడ్వర్టజ్‌మెంట్లు చూస్తుంటే పరమ అసహ్యంగా వుంటున్నది. సరుకుల ప్రకటన మరీ భరించలేని స్థాయిలో వుంటున్నది. సరుకుల చుట్టూ అభూత కల్పనలు అద్భుతీకరణలు మరింత ఎక్కువై పాతకాలపు పురాణకథల్ని తలపిస్తున్నాయి."

"1985, 86 ప్రాంతాల్లో ఇంటింటికీ టీ.వీ.లు విస్తరించాయి. అలా విస్తరించాక వచ్చిన మొదటి మెగా సీరియల్స్ రామయణ, మహాభారతాలు ఎన్ని ఎపిసోడ్లో గుర్తులేదు గాని సంవత్సరం పైగా ప్రసారమయ్యాయి. దాన్ని మనముందుకు అంత పెద్దస్థాయిలో తీసుకురావడం వెనకగల పారిశ్రామిక వేత్తల లక్ష్యం చూడగా నాకొక విషయం స్ఫురించింది. ఒకనాటి వేదాలు ఉపనిషత్తులు, పురాణాలు ఏ పాలకవర్గ భావజాలాన్నయితే ప్రజల్లో విస్తరింప చేశాయో అదేపాలకవర్గ భావజాలాన్ని - జ్ఞానంపేర,ఆధునికత పేర, సంప్రదాయంపేర - ఈనాటి టీ.వీ.లు, సినీమాలు ప్రచారం చేస్తున్నాయి. ప్రతి వ్యాపార ప్రకటనగల కథాంశం సూక్ష్మరూపంలో ఒక పురాణ కథ వంటిది. ఒక అభూత కల్పన. ఒక అద్భుతీకరణ. ఆ మాయాజాలంలో పడిన జనం పాలకవర్గభావజాలాన్ని అంగీకరించకుండా ఉండలేరు. ఆ సరుకుల్ని అనాలోచితంగా ఆమోదిస్తారు. ఆ నాటిది జ్ఞానంగా, భక్తిగానూ - ఈనాటిది వ్యాపారంగానూ కనపడవచ్చు. కాని రెండింటి వెనకగల మౌలికతత్త్వం ఒకటే-"

"భక్తికిగల రాజకీయ ప్రాముఖ్యాన్ని కోశాంబి చాలా చక్కగా వివరించాడు. దాన్ని మరింతగా అధ్యయనం చెయ్యాలి-"

"భక్తివున్నప్పుడు దోపిడీని చాలా సులభం. కర్మ సిద్ధాంతం దోపిడీని మరింత సుగమం చేస్తుంది. దోపిడీకి గురయిన వాళ్లకి కర్మ ఫలం అని నమ్మేలా చేస్తుంది. పూర్వజన్మ, పరజన్మ, ముక్తి, మోక్షం, జన్మరాహిత్యం - ఇవన్నీ దోపిడీ అనుకూల భావజాలాలు "

"ముక్తి, మోక్షం, జన్మరాహిత్యం ...... " అన్నాడు యశ్వంత్

"అవును. మోక్షం అంటే ఏమిటి ? పరమాత్మలో ఐక్యం కావడం. జన్మ రాహిత్యం అంటే ఏమిటి ? మళ్లీ మరోక పుట్టుక లేకపోవడం. అగ్రవర్గాలు - కొన్ని జాతుల్ని, గుంపుల్ని, జనమూహాల్ని సర్వనాశనం చేసి తమలో కలుపుకున్నాయి. మళ్లీ ఇక తలెత్తకుండా చేశాయి. ఇదే పరమాత్మలో లీనం, జన్మ రాహిత్యం అంటే. మోక్షం వెనకగల అసలు రహస్యం ఇదే. పెద్ద సామ్రాజ్యవాద దేశం చిన్న చిన్న దేశాల్ని కబళించి తమలో కలిపేసుకుంటుంది. లేకపోతే కొన్ని వందల వేల మైళ్లదూరంలో వున్న అతి చిన్న దేశమైన ఇంగ్లండ్ - సువిశాలమైన భారతదేశంమీద ఎలా పట్టుసాధించింది ? బ్రిటన్ భారతదేశాన్ని లీనం చేసుకుందనమాట. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని పారదోలడానికి ఒక మహాయుద్ధం చేయవలిసివచ్చింది. ఒక రామరావణయుద్ధం , భాగవతంలో మొసలి-ఏనుగుల యుద్ధం ఇవన్నీ గుర్తొస్తా యినాకయితే -"

ఒక ఆహ్లాదకరమైన గాలితెర సోకి యశ్వంత్‌కి ప్రాణం హాయిమనిపించింది. ఎక్కడో దూరంనుంచి ఒక కోయిల కూస్తోంది.

"పలుదోముపుల్ల చాలా సహజమైనది. ప్రకృతి మానవులకిచ్చిన సహజమైన ఔషధం. పారిశ్రామిక వేత్తల దగ్గిర ఊరిగం చేసే శాస్త్రవేత్తలు టూత్‌పేస్టులు కనిపెట్టారు. మొదట్లో దానివల్ల కొన్ని సౌకర్యాలున్నా క్రమంగా అది పారిశ్రామిక వేత్తలకు లాభాలు తెచ్చిపెట్టే సరుకయిపోయింది. అలాగే సబ్బులు, షాంపూలు, పెట్టుబడిదారీ పారిశ్రామిక విధానం సైంటిస్టుల్ని కూడా తమ బానిసల్ని - చేసుకుంటుంది. వాళ్ల ప్రభావంతో సైంటిస్టులు లాభాలు గడించిపెట్టే సరుకుల్ని రూపొందిస్తారు. ఈ విధానాన్ని బలంగా ఎదుర్కొన్నవాడు అయిన్‌స్టీన్-"

"హిట్లర్ అయిన్‌స్టీన్ తలకు విలువ ప్రకటించాడట. అంతటి మహానుభావుడు రహస్యంగా అమెరికా పారిపోవలసి వచ్చింది. అయినాసరే నాజీలకు వ్యతిరేకంగా పనిచేశాడు. వాళ్లకు కావలసిన విధంగా మారణాయుధాలు తయారుచేసి ఇవ్వలేదు."

ఇంతలో రాజారావు మోపెడ్ మీద వచ్చాడు. అతని ముఖం సంతోషంతో వెలిగిపోతోంది.

"కొత్త రేడియో - కమ్ - టేప్ రికార్డర్ - పదిహేనురోజుల్లోగా ఇమ్మని నిన్ననే కన్స్యూమర్స్ కోర్టు తీర్పిచ్చింది - ఇవిగో కాయితాలు. విజయం మనదే-" అంటూ సంతోషవార్త చెప్పి, లోపలికి వెళ్లి కుర్చీతెచ్చుకుని సురేష్ పక్క వేసుకుని కూర్చున్నాడు.

"వెరీగుడ్ కంగ్రాచ్యులేషన్స్. ఈ శుభ సందర్భంలో ఈ వేరు శనగపప్పు బెల్లం ముక్కతిను -" అన్నాడు సురేష్ నవ్వుతూ.

"మీరిద్దరూ లాగించేసి నాకు కొంచెమే వుంచారు. నాకు డబుల్ కోటాకావాలి"

"ఓ యస్. అంతేకదా. పది నిముషాల్లో మరో పెద్ద ప్లేటుతో వేరుశనగ పప్పు, బెల్ల ముక్క వస్తాయి-"

"థాంక్యూ - థాంక్యూ -"

రాజారావు వాళ్లింట్లో అనేకమంది మధ్య తరగతి యిళ్లల్లో వున్నట్టే అన్నిరకాల ఆధునిక సామగ్రి వుంది. కాని తరచుగా ఏదో ఒకటి రిపెయిర్. ఒకసారి టేబిల్ ఫాన్. ఒకసారి గ్రైండర్. ఈ మధ్య టీ.వీ. ట్రబుల్ ఇస్తే - విసిగి విసిగి - పిక్చర్ ట్యూబ్ వేయించుకున్నారు. దివ్యజ్యోతి ఎంటర్ ప్రైజస్ వాళ్లదగ్గిరకొన్న టు-ఇన్-వన్, టేప్ రికార్డ్ - కమ్ - రేడియో పాడయింది. బాగుచేసి యిచ్చినా ఏదో ఒక కంప్లయింట్ వస్తూనే వుంది. రాజారావు విసిగిపోయి సురేష్ సలహాపై -కన్స్యూమర్స్ కోర్టులో కేసువేశాడు. చివరికి రాజారావే గెలిచాడు. రాజారావుకి ఏకొత్తవస్తువుకొనాలన్నా భయం పట్టుకుంది. వాళ్లతో తగువులు పడిపడి కొంత అనుభవంకూడా వచ్చింది.

"ఒక్కమాట అనుభవంతో చెబుతున్నాను వింటావా - గ్రైండరూ వుండాలి. తిరగలీ రుబ్బురోలు కూడా వుండాలి. గాస్ పొయ్యివుండాలి, కిరసనాయిలు స్టవ్వూ వుండాలి. అన్ని గదుల్లోనూ ఫాన్లూ వుండాలి. కరెంటు పోతే విసనకర్రలూ వుండాలి. ఎమర్జెన్సీ లైటు వుండాలి. అది వెలగకపోతే హరికెన్‌లాంతరు కూడా వుండాలి. అంటే కారూ వుండాలి, సమయాన్నిబట్టి ఎడ్లబండికూడా సిద్ధంగా వుండాలన్నమాట. ఇదీ ఈ నాటి నాగరికత. నామాట అబద్ధమైతే ఎవర్నయినా అడగండి. చాలా యిళ్లల్లోనే చెప్పినట్టుంటాయి-" అన్నాడు రాజారావు. యశ్వంత్, సురేష్ నవ్వేరు.

"ఇన్నాళ్లకి నీకు జ్ఞానోదయం అయిందనమాట -" అన్నాడు సురేష్

"దివ్యజ్యోతి ఎంటర్‌ప్రైజెస్ వాళ్లదయవల్ల " అన్నారిద్దరూ ఒకేసారి.

"రకరకాల యంత్రపరికరాలు వస్తున్నకొద్దీ మనం మరింత సుఖపడాలి, కాని కష్టపడుతున్నాము. ఎందుకనీ ? పెట్టుబడిదారీ పారిశ్రామికత ప్రజల్ని అన్ని కోణాల్లోంచీ తన గుప్పిట్లో బిగిస్తున్నది. మనకు మరొక గత్యంతరం లేకుండా చేస్తున్నది. గీతలో శ్రీకృష్ణభగవానుడు - మా మేకం శరణం వ్రజ అన్నాడు - అలాగే అన్నిటికీ మనం పారిశ్రామికవేత్త శరణు కోరుకోవాలి -" అన్నాడు సురేష్.

లోపలికి వెళ్లి మూడు గ్లాసుల మజ్జిగ తెచ్చాడు.

"మూడు గ్లాసుల రస్నా తెస్తావేమోననుకున్నాను-" అన్నాడు రాజారావు

"రస్నాయేకాదు - చాక్లెట్లు, క్రీమ్ బిస్కెట్లుకూడా మాయింట్లో నిషేధం వాటిల్లో వుండే శాకరిన్ చాలా హానికరమయింది. ముఖ్యంగా చిన్నపిల్లల్లోనూ, గర్భిణీ స్త్రీలలోనూ. అది చాలా దుష్ఫలితాలు కలిగిస్తుంది. బెల్లంలో కాల్షియం శాతం ఎక్కువ. సిగరెట్లు మీద రాసినట్టు చాకెట్ల మీద కూడా 'ఆరోగ్యానికి హానికరం' అని రాయించడం మంచిది"

"సిగరెట్ల వాడకం తగ్గనట్టే చాక్లెట్ల వాడకం కూడా తగ్గదు-"

"మద్యనిషేధం అమలుచేసుకోలేక పోయాంగానీ - ఇక సిగరెట్లూ, చాక్లెట్లూ నిషేధించగలమా?"

"మా అమ్మగారు తోట కూర కావాలన్నారు. పట్టుకెళతాను. శనిగ్రహ శాంతికి -" అన్నాడు రాజారావు. అతను టౌన్లోవుంటున్నాడు. స్వంతయిల్లు. కాని చాలా చిన్న యిల్లు సగం వాటా అద్దెకిచ్చేశారు. చుట్టూ మొక్కలు పెంచుకోవడానికి జానెడు స్థలం కూడా లేదు.

"ఆ పక్క తులసి మొక్క వుంది. అది చాలా పవిత్రమైనది. దాన్ని పూజిస్తారు. దానికి చాలా మహత్యాలున్నాయని నమ్ముతారు. తులసి వైద్యానికి కూడా పనికొస్తుందట. కాని వైద్యానికి పనికొచ్చే మొక్కలన్నిటినీ పవిత్రంగా భావించడం లేదు. తులసి మొక్క వెనక చాలా మతభావనలున్నాయి. దాన్ని మన ప్రాచీనులు పవిత్రీకరించారు. దివ్యీకరించారు. తోటకూరని శుభకార్యాల్లో వాడరు. శుభతిథుల్లోనూ గురు,శుక్ర, శని వారాల్లోనూ తినరు. కాగా శనిగ్రహ దోషనివారణార్థం తోటకూర, నువ్వులు దానం చేస్తారు. అవి దానం పుచ్చుకునేవాడికి దక్షిణ కూడా ఎక్కువగానే ముట్టచెపుతారు. లేని దోషాలు సృష్టించి భయాలూ, కీడులూ కల్పించి దానం పుచ్చుకోవడం అనే పరాన్నభుక్కు విధానం మన ప్రాచీన వ్యవస్థలోనే వున్నది. ఇవన్నీ మన సంప్రదాయవాదుల నమ్మకాలు. కాని ఆహారపదార్థాల్లో తోటకూరకు చాలా ఎక్కువ విలువుంది. దానిలో ఇనుము, విటమినులు ఉన్నాయి. ఆకుకూర శరీరారోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది, కాని సంప్రదాయవాదులు తోటకూరని దరిద్ర హేతువంటారు చంపే ముందు కుక్కకి పిచ్చి పట్టిందని ప్రచారం చెయ్యమన్నాడు ఇంగ్లీషువాడు. -"

"కూరల్లోనూ, తినేవాటిలో కూడా ఫార్వర్డ్, బాక్‌వర్డ్, షెడ్యూల్డు అని వున్నాయనమాట అంటే వర్గవిభేదాలున్నాయన మాట -" అన్నాడు యశ్వంత్.

"బంగారంకంటె రాగి ఎన్నోరకాల ఉపయోగకరమైన లోహం. ఈ యంత్రయుగంలో ఇనుము ఉపయోగం చెప్పనవసరం లేదు. కాని ఇనుము దరిద్రహేతువట. ఇనుపగజ్జెల తల్లి అంటే దరిద్రదేవత అని అర్థం. కాని బంగారాన్ని ఎంతో పవిత్ర లోహంగా భావిస్తారు. పూర్వం దేవతా విగ్రహాలు ఆ లోహంతోనే చేసేవారు.ఇవ్వాళ దానికి చాలా మారకపువిలువ వున్నది రాగికీ, ఇనుముకీ లేదు."

సురేష్‌కి గల విషయ పరిజ్ఞానానికి ఆశ్చర్య పడ్డాడు రాజారావు.

"కరివేపాకు, చింతచిగురు, తోటకూర, గోంగూర, ముంజెలు, తేగలు - ఈ రకం వస్తువులమ్మేవాళ్లని మనం చాలా తక్కువగా చూస్తాం. ఏవిలువా యివ్వం, జంతుచర్మాలు వొలిచి చెప్పులు కుట్టేవాళ్లని, శవాల్ని పూడ్చడానికి గోతులు తవ్వేవాళ్లని, మురికి కాలవలు తుడిచి పారిశుధ్య పనులు చేసేవాళ్లనీ - మనం చాలా నీచంగా చూసాం. ఎంత కష్టమైన పనయితే అంత నీచంగా చూస్తున్నాం అంటే వాళ్లని దోపిడీ చేస్తున్నానమాట. నిజానికి వాళ్ల చేత ఆ నీచపు పనులు చేయించేది మనమే. వర్ణ/వర్గ సమాజంలోనే ఈ దోపిడీ ఇమిడి వున్నది."

"శ్రీకృష్ణుడు అర్జునుడికి విశ్వరూపం చూపించాడట. ఆ విశ్వరూపం మొత్తం ఆయుధాల ప్రదర్శన. ఆనాటి అద్భుత వస్తుప్రదర్శన. అగ్రవర్గ భయంకర స్వరూప ప్రదర్శన. ఇప్పటికీ పాలకవర్గాలు మనదేశంలో ఆగస్టు 15, జనవరి 26 సమయంలో ఎంతపెద్ద ఎత్తున ఆయుధ విన్యాసాలా, ప్రదర్శనలూ నిర్వహిస్తున్నారో చూస్తున్నాం. ప్రజల్లో తిరుగుబాటు వస్తే ఆప్రాంతంలో శాంతిభద్రతలు స్థాపించడానికి - పెద్దఎత్తున మిలటరీ దించి వీధుల్లో కవాతు జరిపి ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తారు. ఈ కరివేపాకూ, తోటకూరలాంటి మామూలు జనం లొంగిపోయి దాసోహం అవాలనమాట - నేను చాలా క్లుప్తంగా చెప్పాను. ఈ సంగతి ఉత్పత్తి సంబంధాలు విశ్లేషిస్తే మరింత సులభంగా బోధ పడుతుంది"

ఆ మాటలు వింటూ రాజారావు ఒక సంగతి గుర్తు తెచ్చుకున్నాడు.

"నేను గత యేడు నూకాలమ్మ సంబరాలకి అనకాపల్లి వెళ్లాను. లక్షసంగతి చెప్పలేనుగాని - యాభై అరవైవేలకు తక్కువ లేకుండా జనం చేరతారు. రికార్డింగ్ డాన్సులు, కోయ డాన్సులు, బుర్రకథలు జనం తొడతొక్కిడిగా వుంటారు. రాత్రి తెల్లవార్లూ ఊరు ఊరంతా వేడుకలు జరుగుతాయి. అమ్మవారి మీద భక్తికాదు - నేను నిజం చెబుతున్నాను, ఎక్కువమంది అమ్మాయిల్ని రాసుకుతిరగొచ్చని వస్తారు. నెహ్రూ చౌక్‌లో పెద్ద పెద్ద కటౌట్లు పెట్టారు. మూడు గుర్రాల మార్కు సిగరెట్లు - పెద్ద పేద్ద మూడు గుర్రాలబొమ్మలు - మరొక పక్క రంకెవేస్తున్న ఎద్దు - ఎద్దు మార్కు సబ్బు - మరోపక్క కన్నుకొట్టేసినీ తార బొమ్మ - ఆ ఎడ్వర్టయిజుమెంటు చూస్తుంటే అమ్మవారి పండగకీ - ఈ ప్రకటనలకీ గల సంబంధం ఆనాడు బోధపడలేదు. ఇప్పుడు కొంచెం కొంచెం బోధపడుతున్నది -" అన్నాడు రాజారావు.

"ఇది సరుకుల ప్రపంచం. బాబ్రీ మసీదు కూల్చివేత వెనక చాలా మందికి హిందూ - ముస్లిం విభేదాలుకన్పిస్తాయి. కాని హిందూ ఆర్థిక విధానం యొక్క నియంతృత్వరూపం చాలా మందికి అర్థంకాదు. పూర్వపు పెద్ద పెద్ద గుళ్లు సంపదలకి నిలయాలని మీకు తెలుసుకదా -" అంటూ వివరించాడు సురేష్.

కాస్సేపు చర్చ ఈజిప్టులోని పిరమిడ్లగురించి సాగింది. ప్రాచీన ఈజిప్షియన్ మత విశ్వాసాలు, ఆదిమ క్రైస్తవం, ఇస్లాం మత విశ్వాసాలూ, మరణానంతర జీవితం, శవాల చుట్టూ పేర్చివుంచిన అద్భుత సంపదా - ఇవన్నీ చర్చించారు. మతాలు వేరయినా వాటి వెనకగల సారభూత మౌఢ్యం, కౌటిల్యం, క్రౌర్యం మాత్రం ఒకటే.

"బాబూ - యశ్వంత్ బాబూ - బాబూ-" చాలసేపటినుచీ కోటి పిలుస్తున్నాడు. కబుర్లలో పడి ఎవరూ వినిపించుకోలేదు. పొద్దుబాగా వాలింది. సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఆకాశం కుంకం ఆరబోసినట్టయి - క్రమంగా ఆ కుంకం నీలి రంగులోకీ - నలుపురంగులోకీ - తిరగబోతున్నది -

" ఆఁ ఆఁ -" అని పలికాడు యశ్వంత్

"యాప పుల్లల కట్టబాబూ -"

"ఇంటి దగ్గిర ఇచ్చీ - నేనింతవేగం రాను. ఆలస్యం కావచ్చు. ఇందా ఈ రూపాయి తాసుకో

కోటి గేటుతీసుకుని లోపలికి వచ్చాడు. అతని చేతిలో వేపపుల్లల కట్ట కాక మరొక కట్టవుంది. అది తుమ్మపుల్లల కట్ట. రాజారావు చూశాడు, "ఆ కట్టిలా యిచ్చీ. ఇందా రూపాయి తీసుకో -" అన్నాడు.

కోటి రెండురూపాయలు పుచ్చుకుని సంబరపడిపోతూ ఇంటిదారి పట్టాడు.

"మీకు లోగడ ఒకసారి చెప్పాను. మా గురువుగారు సత్యం మేస్టారు. ఆయన నాస్తికత్వంతో ప్రారంభించి క్రమంగా మార్క్సిజం వైపు మళ్లారు. ఆయనొకసారి తన అనుభవాలు వివరించారు. నేను దేవుడితో పోరాడి గెలిచాను. మాయింట్లో ఇవ్వాళ ఒక్కదేవుడి బొమ్మ లేదు. పూజాపునస్కారాలూ, తిధివారనక్షత్రాల బెడదా లేకుండా హాయిగా బ్రతుకుతున్నాం. కాని టీ.వీ.లొచ్చాయి. కొత్తకొత్తగా దిగుతున్న ఆధునిక పరికరాలన్నీ మా యింట్లోకీ వచ్చేసేయి. ఆధునిక నాగరికతకు నేను వ్యతిరేకిని కాదు. కాని యంత్రాలకు మానవుడు బానిస కాకూడదు. మానవుడు యంత్రాన్ని నియంత్రించాలి. ఇవ్వాళ నాగరికత - సరుకులమాయ ఏ స్థాయికి వెళ్లిందంటే ఆఖరికి చెవి దురద వేస్తే చెవిలో తిప్పుకునే పుల్లకూడా - పలానా కంపెనీవారు తయారుచేసినవే వాడాలనే వరకు వచ్చింది. మానవుణ్ణి ప్రకృతి నుంచి పూర్తిగా దూరం చేశారు, అన్ని రంగాల్లో కృత్రిమత్వం రాజ్యం ఏలుతున్నది. తోటకూరను ఓడించి తులిసాకు పవిత్రని ఘనతని పొందే కృత్రిమ కాలం వచ్చింది. ఇవ్వాళ మనం ఈ పద్ధతిలో పోరాడాలి. ఇది ఒక రకంగా సరుకులమీద పోరాటం అంటే పర్వతంతో తల ఢీకొట్టడం వంటిది కాని తప్పదు లేకపోతే తోటకూరా తాటిముంజెలూ కూడా అమెరికావారికి హక్కుభుక్తమై పోతాయి. అంచేత మనం సరుకుల్తో పోరాడాలి. సరుకుల్తో పోరాటమంటే సామ్రాజ్య వాదంతో పోరాటం అన్న మాట. గాట్ సంగతి మనందరికి తెలిసిందే. మరి కొద్ది సంవత్సరాల్లో మనం అమెరికా గుప్పెట్లోకి పోతున్నాం. ఇప్పటికే కొన్ని రకాల వరి వంగడాల పేటెంట్ హక్కుల మీద గొడవ ప్రారంభమైంది. మరోసారి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున విదేశ వస్తు బహిష్కరణ ఉద్యమం జరగాలి " అన్నాడు సురేష్. అంతా ఆలోచన్లో పడ్డారు.

యశ్వంత్ కాశ్మీర్ సమస్యమీద వచ్చిన కొత్త పుస్తకం ఇమ్మని అడిగాడు.

సృజన 250 వ సంచిక అల్లూరి సీతారామరాజు ప్రత్యేక సంచిక. ఆ సంచిక ఇమ్మన్నాడు, రాజారావు.

"ఒక్క క్షణం కూచోండి తెస్తాను-" అని లోపలికి వెళ్లేడు సురేష్. ఏయే సబ్బులు, పేస్టులు, బ్లేడులు స్వదేశీ కంపెనీవో ఏవి విదేశీ కంపెనీవో తెలిపే పెద్ద చార్టు చూపించాడు. ఇది బీజేపీ వాళ్లు వేసిందికాదు, మా పౌరహక్కుల సంఘం తయారు చేసింది" - అన్నాడు యశ్వంత్.

గేటు ముందు లూనా ఆగింది. సురేఖ !

"నాలుగున్నరనుంచీ నీకోసం ఎదురుచూస్తున్నాను తెలుస్తా ? అసలు మా యింటికి వస్తానని చెప్పినమాటే మర్చిపోయావా ?" అంటూ లోపలికొచ్చింది. ఇంతలో సురేష్ పుస్తకాలు తెచ్చి యశ్వంత్‌కీ, రాజారావుకీ ఇచ్చాడు. తల్లినడిగితే తటకూర మొక్కలివ్వడానికి ఏదైనా అభ్యంతరం చెబుతుందేమోనని అడక్కుండానే నాలుగు మొక్కలు పీకి, ఒక పోలతీన్ సంచిలో వేసి గప్‌చిప్‌గా రాజారావుకిచ్చాడు.

"సారీ - ఆపుల్లీ సారీ - ఈ యశ్వంత్ వస్తేనూ -" అన్నాడు సురేష్. "

"యశ్వంత్ , ఈమె సురేఖ. ఎం.ఏ. పాలిటిక్స్ - సురేఖా ఇతను యశ్వంతరావు. ఇతను రాజారావు-" అని పరిచయాలు చేశాడు.

"అంతేనా? కేవలం అంతేనా?" అన్నాది సురేఖ మొహం ఎర్రగా చేసుకుని

"ఇంకేం చెప్పాలి. ఓఁ - సారీ - సురేఖ గొప్ప ప్లేయర్ - ఇంటర్ కలేజియేట్, ఇంటర్ యూనివర్శిటీ స్పోర్ట్సులో కప్పులూ, గోల్డ్ మెడల్సూ సంపాదించింది. ఫోర్ హండ్రడ్ మీటర్స్ డాష్‌లో ఫస్టు-"

"అంతేనా ? ఇంకేమీ లేదా ?"

"ఇంకా ఏమిటి ?"

"నాచేత చెప్పించాలనా నీ వుద్దేశం?"

"పోనీ చెపితే తప్పేమిటీ?"

"సరే - చెబుతాలే - చూడండి కొద్దిరోజుల్లో సురేష్ నేనూ పెళ్లి చేసుకోబోతున్నాం-"

"ఆదర్శ ప్రాయంగా రిజిస్టర్డు మారేజీ చేసుకుంటారు. అంతేనా ?" అన్నాడు రాజారావు.

"కాదు - కేవలం. చిన్న టీ పార్టీ. సత్యం షేస్టారొస్తున్నారు. ఆయన సమక్షంలో మిత్రులందర్నీ పిలిచి - " ఈ రోజు నుంచీ మేం కలిసి సహజీవనం చేస్తున్నాం -" అని చెబుతాం. ఆ సమయానికి వచ్చిన స్నేహితులకి బిస్కట్స్, టీ ఇస్తాం. దట్సాల్ - కాని సురేఖా ! నేను కొన్నాళ్లాగి, సడన్‌గా చెప్పి సర్‌ప్రయిజ్ చేద్దామనుకున్నాను వీళ్లని -"

"నేను నిన్ను సర్‌ప్రయిజ్ చేస్తా చూడు - నాకు ఉస్మానియా యూనివర్శిటీలో పి.ఎచ్.డీ. సీటొచ్చింది. టాపిక్ కూడా ఎప్రూవ్ అయింది Caste politics in Andhra Pradesh 1956 - 96 నేను వచ్చే మే ఐదవ తారీకున హైదరాబాదు వెళ్లిపోతున్నాను. -"

"కంగ్రాచ్యులేషన్స్ - కాని నిన్ననే మీ కల్పన ఈ సంగతి నాకు ఫోన్ చేసి చెప్పిందిలే" సురేఖ కోపంగా సురేష్ వంక చూసింది సురేష్ లేచి గుమ్మం ముందు లైటు వేశాడు.

"అయితే ఈ లోగానే మీ పెళ్లనమాట" అన్నాడు యశ్వంత్.

అందరి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.

*రచన : 23 - 4 - 1998 -- 25 - 4 - 1998*